క్లుప్తంగా

పోషకాహారంపై అవగాహన

కొండమల్లేపల్లి: పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో బుధవారం గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆకుకూరలు, పప్పుదినుసుల ప్రాధాన్యత గురించి వివరించారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా సుఖ ప్రసవానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ పి.సరళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ, శారద, లింగమ్మ పాల్గొన్నారు.

హాలియా తైబజారు వేలం

హాలియా: హాలియా మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను తైబజారు వేలం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి తెలిపారు. ఈ వేలంలో ఆరుగురు డిపాజిట్ దారులు పాల్గొనగా బండి ఈశ్వరయ్య రూ.1,77,000కు తైబజారు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, కౌన్సిలర్లు వర్ర వెంకట్‌రెడ్డి, ప్రసాద్‌నాయక్, తక్కెలపల్లి సైదులు, మున్సిపల్ మేనేజర్ ఎంఏ రషీద్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

దేవరకొండ: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని మానుకొని, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రభుత్వమే వంట పాత్రలు, గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జూలూరి వెంకట్రాములు, జంగమ్మ, ధనలక్ష్మి, అంజమ్మ, సైదమ్మ, వెంకటమ్మ తదితరులున్నారు.


రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వినతి

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని తడకమళ్ల బైపాస్ నుంచి కాల్వపల్లి బ్రిడ్జి వరకు గల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా వర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పాత రోడ్డును తవ్వి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ కొత్త రోడ్డు వేయలేదని అన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై అధికారులకు విన్నవించినా స్పందించలేదన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎండీ సయ్యద్, లింగానాయక్, వెంకన్న, మాధవి, గోపాల్ తదితరులున్నారు.

లోక్‌సభలో మహిళా బిల్లు ప్రవేశపెట్టడం చరిత్రాత్మకం

దేవరకొండ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం లోక్‌సభలో మహిళా బిల్లును ప్రవేశపెట్టడం చరిత్రాత్మకమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ అన్నారు. బుధవారం దేవరకొండ మండలంలోని తూర్పుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రూపొందించిన మహిళా బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపి లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని అన్నారు. సరైన సమయంలో ఎన్నో కఠిన నిర్ణయాలు తీసుకొని దేశ ప్రజలు తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని నరేంద్ర మోదీ నిలబెట్టుకున్నారని అన్నారు. సమావేశంలో బొడ్డుపల్లి అంజి, దర్శనం శ్రీను, ఏర్పుల మురళి తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


వేణు కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి తదితరులు

హాలియా: పట్టణంలోని మూడో వార్డుకు చెందిన సీకే యూత్ సభ్యుడు రేవల్లి వేణు రెండేళ్ల క్రితం కరోనాతో మృతిచెందాడు. కాగా యూత్ సభ్యులు విరాళాలు సేకరించిన రూ.50వేల నగదును బుధవారం ఎమ్మెల్సీ కోటిరెడ్డి చేతుల మీదుగా వేణు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ కౌన్సిలర్ ఫోరం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ అన్నెపాక శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, తెలంగాణ ఉద్యమ నాయకుడు వడ్డె సతీష్‌రెడ్డి, సీకే యూత్ అధ్యక్షుడు బండి రమేష్, నాయకులు గోపిశెట్టి సైదులు, రావులపాటి ఎల్లయ్య, అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు మద్దిమడుగు మార్క్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన మినీ ట్యాంక్‌బండ్ పనులు

- అసంపూర్తిగా చెరువు కట్ట, సీసీ రోడ్ల నిర్మాణం
- కానరాని ఆహ్లాదం


చెరువులో ఏర్పాటు చేసిన బోటింగ్


వంతెన వద్ద అసంపూర్తిగా పనులు

మిర్యాలగూడ: సీఎం కేసీఆర్ ప్రతి నియోజకవర్గానికి ఒక చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించారు. ఇందులో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని పందిళ్లపల్లి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చి పట్టణవాసులకు ఆహ్లాదాన్ని పంచాలనుకున్నప్పటికీ ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పనులు ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి.

రూ.25కోట్లతో పనులు..

పందిళ్లపల్లి చెరువు మిర్యాలగూడ, యాద్గార్‌పల్లి గ్రామాల పరిధిలో సుమారు 480ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దేందుకు ప్రభుత్వం 2017 సంవత్సరంలో పనులు ప్రారంభించగా.. ఇప్పటివరకు మొత్తంగా రూ.25కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో చెరువు పూడికతీత పనులతో పాటు కట్టల వెడల్పు, లింకురోడ్డు, పార్కుల నిర్మాణం, బోటింగ్, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా అన్ని పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. బ్రిడ్జి నిర్మించినప్పటికీ దానిపై చేపట్టాల్సిన పనులు ఇంకా మిగిలి ఉన్నాయి. చెరువు కట్టను బలోపేతం చేసి రక్షణ కంచె ఏర్పాటు చేయాల్సి ఉండగా నిధుల కొరతతో పనులు నిలిచిపోయాయి. మినీ ట్యాంక్ పనులు పూర్తి కావాలంటే ఇంకా సుమారు రూ.9కోట్ల నుంచి రూ.10కోట్ల నిధులు అవసరం ఉంటుంది.

పూర్తికాని చెరువు కట్టల విస్తరణ..

చెరువు కట్టలపై ఉన్న చెట్లను తొలగించి నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు సుమారు 2కి.మీ, 6మీ వెడల్పుతో విస్తరణ పనులు చేపట్టగా ఇప్పటికీ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. అదేవిధంగా కట్టకు రెండు వైపులా రెయిలింగ్ పనులు చేపట్టాల్సి ఉండగా వాటి జాడే లేదు.

అధ్వానంగా బతుకమ్మ ఘాట్..

చెరువు వైపు సుమారు 150 మీటర్ల దూరం బతుకమ్మ ఘాట్‌కు సౌకర్యంగా మెట్లను ఏర్పాటు చేశారు. కానీ బతుకమ్మ ఘాట్ వద్ద చెత్తాచెదారం పేరుకపోయి దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు.

కొనసాగుతున్న లింకురోడ్డు పనులు..

పట్టణంలోని పందిళ్లపల్లి చెరువు, బోటింగ్ పార్కు, ఉమామహేశ్వరాలయం నుంచి నల్లగొండ రోడ్డు వరకు 1.5కి.మీ మేర లింకు రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది. అదేవిధంగా దానిపై కల్వర్టులు ఏర్పాటు చేసి బీటీ వేయాల్సి ఉంది. రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం 24ఫీట్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే మినీ ట్యాంక్‌బండ్, బోటింగ్ పార్కుకు రావాలనుకునే వారు నేరుగా లింకురోడ్డు మీదుగా చేరుకోవచ్చు. ఈ లింకు రోడ్డు నుంచి బోటింగ్ పార్కు వరకు వాకింగ్ చేసేవారికి మంచి సౌలభ్యంగా ఉంటుందని కానీ పనులు ఇంకెంతకాలానికి పూర్తవుతాయోనని పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పెరగనున్న నీటి సామర్థ్యం..

పందిళ్లపల్లి చెరువు కట్టను బలోపేతం చేయాల్సి ఉండగా పనులు సాగుతూనే ఉన్నాయి. కట్టలు బలోపేతం చేయడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. దీనివల్ల ఈ చెరువు చుట్టూ ఉన్న మిర్యాలగూడ పట్టణం, యాద్గార్‌పల్లి, యడ్రావులపాడు, కాల్వపల్లి, బాదలాపురం, గూడూరు, కిష్టాపురం గ్రామాల పరిధిలో భూగర్భజలాలు పెరిగి రైతులకు సాగు, తాగునీటి కొరత తీరనుంది.

పార్కు అధ్వానంగా ఉంది



సాయంత్రం వేళ పందిళ్ల చెరువు బోటింగ్ పార్కు వద్దకు వస్తుంటాం. కానీ పార్కు నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారైంది. పిల్లలు ఆడుకోవడానికి వీలు లేకుండా ఉంది. అధికారులు స్పందించి పార్కును బాగు చేస్తే పిల్లలు, పెద్దలు ఆహ్లాదకరంగా గడుపుతారు.

– బి. జగన్, మిర్యాలగూడ

పనుల్లో వేగం పెంచాం



మినీ ట్యాంక్‌బండ్‌లో సీసీ రోడ్ల నిర్మాణాలు, చెరువు కట్టకు రెయిలింగ్ ఏర్పాట్లు చేస్తున్నాం. మార్నింగ్ వాకింగ్, యోగా చేసుకునేందుకు పార్కులో ఏర్పాట్లు చేస్తున్నాం. పనులు వేగంగా చేస్తున్నాం. చెరువులో నీరు ఉండడం వల్ల పూడికతీత పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నీటిమట్టం తగ్గితే పనుల్లో వేగం పెంచుతాం. సర్వే నం.114లో కొంతమేరకు చెరువు శిఖం ఆక్రమణకు గురైందని గుర్తించాం. నోటీసులు జారీ చేశాం. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– జనార్దన్, ఐబీ డీఈ

నిరంతరం కరెంట్ ఇచ్చి పంటలను కాపాడాలి


ఉట్లపల్లి సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మిర్యాలగూడ అర్బన్: నిరంతరం కరెంట్ ఇచ్చి పంటలను కాపాడాలని మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లిలో బుధవారం సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉట్లపల్లిలో కరెంట్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని వాపోయారు. ప్రభుత్వం 24గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతున్నా.. అది అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజులో పది గంటలు మాత్రమే కరెంట్ ఇస్తున్నారని ఇస్తున్నారని అన్నారు. తమ గ్రామానికి ఇవ్వాల్సిన కరెంట్‌ను యాద్గార్‌పల్లికి ఇస్తున్నారని ఆరోపించారు. కరెంట్ విషయమై అడిగేందుకు సబ్‌స్టేషన్ వద్దకు వెళ్తే ఎవరూ అందుబాటులో ఉండటం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్, ఎస్‌కే షాబు, శంకర్‌రావు, తూడి ప్రభాకర్‌రెడ్డి, నరసింహారావు తదితరులున్నారు.

కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ సెలక్షన్స్


ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులతో సుబేదార్ మేజర్ మాధవరావు తదితరులు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ సెలక్షన్స్ నిర్వహించారు. ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ రాచమల్ల శ్రీను పర్యవేక్షణలో నల్లగొండలోని 31వ ఎన్‌సీసీ బెటాలియన్‌కు చెందిన సుబేదార్ మేజర్ మాధవరావు, నాయబ్ సుబేదార్ కె. జగన్నాథం, హవాల్దార్ ఎం. సంతోష్ తదితరులు డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. అనంతరం సుబేదార్ మాధవరావు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు దేశానికి సేవ చేసే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అన్నారు. నైతిక విలువలతో పాటు వ్యక్తిత్వాన్ని పెంచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ టి. వెంకటరమణ తదితరులున్నారు.

రికార్డుల నిర్వహణ సరిగ్గా ఉండాలి


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

అడవిదేవులపల్లి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులు సరిగ్గా ఉండేలా చూసుకోవాలని సామాజిక తనిఖీ అధికారులు అన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా మండలంలో చేపట్టిన పనులపై బుధవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా 2021 జనవరి 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 304 పనులను గుర్తించగా ఆ పనులను కూలీలు చేపట్టారు. ఇందుకు గాను కూలీలకురూ.4.46 కోట్లు, మెటీరియల్ కాంపొండ్ కింద రూ.1.03కోట్లు చెల్లించారు. ఈ పనులకు సంబంధించిన ఖర్చుల వివరాలు, అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలను అధికారులు పరిశీలించారు. పెండింగ్ పనులు, రికార్డులు సరిగా లేని కారణంగా రూ.3.3లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. వీటిలో రూ.2.4లక్షలు గ్రామ పంచాయతీలకు సంబంధించిన అసంపూర్తి పనులతో పాటు రూ.63వేలకు సంబంధించిన రికార్డులు సరిగా లేవనే కారణంతో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలను బాధ్యులుగా చేశారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని అన్నారు. ఈ తనిఖీల్లో ప్రజా దర్బార్ ప్రిసైడింగ్ అధికారి, అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ వీబీ శైలజ, అధికారులు గోరి, వి. రాజు, చిరంజీవి, నాగయ్య, ఎంపీడీఓ షరీఫ్, ఎంపీఓ లలిత, సర్పంచులు కొత్త మర్రెడ్డి, రమావత్ ప్రియాంక, బాలునాయక్, పకీరానాయక్ తదితరులున్నారు.

అనారోగ్యంతో రెండవ ఏఎన్ఎం మృతి

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండవ ఏఎన్ఎంగా పనిచేస్తున్న జానకమ్మ(35) అనారోగ్య కారణాలతో బుధవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మిర్యాలగూడ డిప్యూటీ డీఎంహెచ్ఓ కేసారవి, అడవిదేవులపల్లి మండల వైద్యాధికారులు ఉపేందర్, నితిన్, ఇతర వైద్య సిబ్బంది మిర్యాలగూడలో నివాసముంటున్న జానకమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

నిరసన దీక్ష నోటీసు అందజేత

నాగార్జునసాగర్: తమ డిమాండ్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు నిరసన దీక్షలు చేపట్టేందుకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రి ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నుంచి తాము మధ్యాహ్నం సమయంలో నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భానుప్రసాద్‌కు నోటీసు అందజేశారు. వైద్య విధాన పరిషత్‌ను రద్దుచేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చాలని, ఉద్యోగులకు ట్రెజరరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని, కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తి, సుధా, రాజేశ్వరి, పద్మ, కోటేశ్వర్‌రావు, వీరబాబు, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

చందంపేట: నేరెడుగొమ్ము మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పద్మ అన్నారు. బుధవారం నేరెడుగొమ్ము ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నేరేడుగొమ్ము మండలంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. మారుమూల గ్రామాలు, తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాలునాయక్, ఎంపీడీఓ ఝాన్సీ లక్ష్మిబాయి, సర్పంచులు నాగు, పాషానాయక్, రవీందర్, కోఆప్షన్ సభ్యుడు పాషా, అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్



మిర్యాలగూడలోని హనుమాన్‌పేటలో మట్టి గణపతితో ఫొటో దిగిన చిలుకూరు జాహ్నవి, శ్రీనివాసులు దంపతులు


ఇంట్లో ప్రతిష్ఠించిన మట్టి గణపతితో నిడమనూరు మండల కేంద్రానికి చెందిన గుంటోజు హృదయ్

అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల పంపిణీ

కొండమల్లేపల్లి: మండల పరిధిలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు ఉన్నతాధికారుల సూచన మేరకు బుధవారం సరుకులను పంపిణీ చేసినట్లు సీడీపీఓ ఉదయం తెలిపారు. బుధవారం స్థానికంగా ఆమె మాట్లాడుతూ.. గత కొన్నిరోజులుగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ టీచర్లు సమ్మెలో ఉన్నారని, కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 101 అంగన్‌వాడీ కేంద్రాలకు 15 రోజులకు సరిపడా పాలు, కోడిగుడ్లు, బియ్యం, పప్పు, నూనె, బాలామృతం వంటివి పంపిణీ చేసినట్లు తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య కొరకు టీశాట్ లింక్‌ను ప్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులకు వాట్సాప్ గ్రూప్ ద్వారా పంపించినట్లు తెలిపారు. ఆమె వెంట ఏసీడీపీఓ సరళ, శాంతి, సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ, పి. విజయలక్ష్మి, సువర్ణ, రజిత, వరలక్ష్మి తారాకుమారి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాళి


రామసైదులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే కిషోర్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎన్ఆర్ఐ కొంపల్లి శ్రీనివాస్ తండ్రి బొలిగొర్ల రామసైదులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి బుధవారం తిరుమలగిరి మండలంలోని కొంపల్లిలో గల శ్రీనివాస్ నివాసానికి చేరుకొని రామసైదులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌కు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి


బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా: బీసీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. బుధవారం హాలియా పట్టణంలోని చైతన్య ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని 377 మంది బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను వాడుకున్నారని విమర్శించారు. ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించేందుకు రూ.లక్ష ఆర్థికసాయం చేస్తుందని అన్నారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యంకాని హామీలను ఇస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఎక్కడా రూ.4వేలు పింఛన్, రూ.15వేలు రైతుబంధు, రూ.2లక్షల రుణమాఫీ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. సీఎం కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని అన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

అనుముల మండలంలోని చింతగూడెం, రామడుగు, కొట్టాల, పెద్దవూర మండలంలోని సంగారం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, ఎంపీపీలు బొల్లం జయమ్మ, మంచికంటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చేకూరి హనుమంతరావు, కర్ణ బ్రహ్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లు, వివిధ మండలాల అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ


తూర్పుపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: కేసీఆర్ పాలనలో తెలంగాణలోని గ్రామాలకు మహర్దశ వచ్చిందని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ మండలంలోని తూర్పుపల్లిలో మన ఊరు–మన పథకాలు కార్యక్రమంలో భాగంగా రూ.2.55కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషిచేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మారుపాకల సురేష్‌గౌడ్, పల్లా ప్రవీణ్‌రెడ్డి, చింతపల్లి సుభాష్‌గౌడ్, టీవీఎన్ రెడ్డి, ఎనిమల్ల నిర్మల, నాగవరం ప్రభాకర్‌రావు, నాగవరం నరేందర్‌రావు, రేణుగౌడ్, బొడ్డుపల్లి శేఖర్ తదితరులున్నారు.

బొజ్జ గణపయ్యకు కొనసాగుతున్న పూజలు


హాలియా: వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్ తదితరులు


తిరుమలగిరి: గణేషుడికి పూజలు నిర్వహిస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి తదితరులు


మిర్యాలగూడ అర్బన్: సంతోష్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్


మిర్యాలగూడ టౌన్: బంగారుగడ్డలో పూజలు చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వర్‌రావు

ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం


కంపాసాగర్‌లో ప్రచారం చేస్తున్న రవికుమార్

త్రిపురారం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోనే దేశాభివృద్ధి సాధ్యమని నాగార్జునసాగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ రవికుమార్ నాయక్ అన్నారు. బుధవారం త్రిపురాం మండలంలోని కంపాసాగర్‌లో మేరీ మిట్టీ–మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవికుమార్‌నాయక్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులను స్మరించుకునే విధంగా దేశ రాజధానిలో స్థూప నిర్మాణానికై ప్రధాని మోదీ పిలుపు మేరకు పార్టీలకతీతంగా ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరణ జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలోని రామాలయంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మేదరి సైదులు, బూత్ అధ్యక్షుడు అవిరెండ్ల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని 14మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను జిల్లా పరిషత్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, పెద్దఅడిశర్లపల్లి జెడ్పీటీసీ అలుగుబెల్లి శోభారాణి బుధవారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఏవీరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీని బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సబావత్ సైదానాయక్, ఉపాధ్యక్షురాలిగా శ్వేత, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, కోశాధికారిగా రాజు, గౌరవ అధ్యక్షుడిగా కొండల్‌రెడ్డి, ప్రధాన సలహాదారులుగా సత్యనారాయణచారి, శేఖర్, కార్యవర్గ సభ్యులుగా నాగేశ్వర్‌రావు, అరుణ్, యాసీన్ ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను ఎంపీడీఓ ఖాజా అస్గర్‌అలీ, ఎంపీఓ పద్మ అభినందించారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

చింతపల్లి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చింతపల్లి మండల కేంద్రంలో హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న, కోఇన్‌చార్జి బోడ సునీల్ హాజరై మాట్లాడారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టడంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గోపాల్, సందే యేసు, ఎర్ర జగన్, ఆరెకంటి యాదయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు అధిక సీట్లు కేటాయించాలి

మిర్యాలగూడ టౌన్: చట్టసభల్లో బీసీ మహిళలకు అధిక శాతం సీట్లు కేటాయించాలని బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌లో మహిళా బిల్లుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. 33శాతంలోనూ బీసీ మహిళలకు అధిక సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మురళీయాదవ్, సురేష్, జ్వాల వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వాడపల్లిలో కృష్ణా నది బ్రిడ్జి వద్ద బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ జవహర్‌లాల్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు హాతీరాంనాయక్, ఎస్ఐ రవికుమార్, ఎంపీడీఓ జానయ్య, పీఆర్ ఏఈ సతీష్, ఆర్ఐ సతీష్, ఏఎస్ఐ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

పెద్దవూర: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించాల్సి ఉండగా.. కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ చెన్ను అనురాధ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేములపల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మునగాల మండలం గణపవరం గ్రామానికి చెందిన మెండెం కృష్ణయ్య, పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన పరెడ్డి రమేష్‌రెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా రావులపెంట గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ మేరకు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానులతో పాటు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేశామన్నారు.